
# జతగాళ్లు

నల్లపైంట్ కుత్తెంగ దొడుక్కొని, దానిమీద గోదుమరంగు సిండుసేతుల సిల్క్ కుర్త దొడ్గి, బెల్టు వెట్టి, బాలు మీదికి ఎగదువ్విన గోపాలు ఎంట అంతకంటె ఓ జిట్టెడు పొడుగున నశ్యపు రంగు ఒడులు లాగు మీద సంత్రరంగు గిరలబుష్కోటు దొడ్క్కొని, సన్నటి మీసపుట్లు రింగులుపెరిగి, పొట్టిబాలు వెట్టుకోని గోపాల్‌దోస్తు వొచ్చిండు. 'వొంకర టొంకర వయసే సక్కన' అన్నరు. అన్నివొంకర్లు సక్కన జేసేది వయిసే. నిరుడే దసరకు వచ్చిండె గోపాలు. యాడాది లోపట ఎంత మారిపోయిండు పిలగాడు? ఎత్తటిపిల్లలు. మొగతనం కరిగిచ్చి పోసినట్లున్నరు. ఉత్తరం పత్తరం లేకుండ ఎకాఎకి వచ్చి, అమ్మా, అని పిలిసేవరకు రాధమ్మకు ఎరికే లేదు. ఆ గొంతు పొగరుకోడె రంకె వోలె రాదమ్మ చెవుల పడి ఉలిక్కిపడింది ఒక్కసారి ఇనుతలికి గంతేసినట్లు ఉరుక్కుంటొచ్చి కొడుకును జూసింది. సంతోషాన నోట మాట రాక మొకం పూలపుట్ట తీర్గ జేసుకోని నిలబడ్డది. కొడుకు ఒక్కడే గాదు పోకచెట్టు పక్కకు పున్నాగ సెట్టోలె ఉన్న పిలగాణ్ణి జూసి, ఎట్లైనా మా గోపాలయ్యకు నా మాటంటె శనా గురి. మొన్నక్యాప ఒక్కమాట ఇట్ల సెవుల ఏసిన్నో లేదో, పిల్లదానికి అప్పుడే మనుము గుట రిస్సెకొని పిల్లగాణ్ణే ఎంటవెట్టు కొచ్చిండు. అని సంబురం బట్టలేకపోయింది కొడుక్కును కొంచెం ఇటటు పిల్సి, గోపా! యాపుకు పేరు వెట్టే టట్లు లేదు గని, గుణం ఎట్లుంటిదో? బుద్ధిమంతుడేనా? అని అడిగింది: తల్లిమాట



48A

యని గోపాల్ అదేందే? అమ్మ! అట్ల డుగ్తవు? బుద్ధిమంతుడు గా కేమైండు. కాలేజ్‌ల నా జతగాడు రహీం అమ్మా! అని జెప్పిండు. ఈమాట యినంగనే రాదమ్మ నెత్తిమీద మొగు లూడి పడ్డంత పనైంది. ఆమె నిలవడ్డ భూమి కిందికి పాతళాల లోకానికి ఒగవడి కుదిచ్చుక పోయె ఉట్లు అనిపిచ్చింది. ఆమె మనసుల గడిసిపోయిన ముచ్చెట్లన్ని సినిమాల బొమ్మ లోలె మెసల్నవి.

నిజంగ ఉన్నవాస్తం జెప్పాల్నంటె సిన్నప్పటి నుండి రాదమ్మ సీతమ్మ ఒక్క కంచంల దిని ఒక మంచంల పండినట్లు మెలిగిన్రు; సూడు సూడు సుసు కుంట వాళ్లకు మనుము గూడ ఒక్క ఊళ్లనే గుదిరింది. అందుకే ఇద్దరు ఒగర్ని యిడ్సి ఒగరు ఉండనే లేదు. కాని సీతమ్మ కర్మకొద్ది ఆమెకు శాన దినాలవరకు పిల్లలు పుట్టా, పెట్టనే అయింది. మందులు, మాకులు, మంత్రాలు, తంత్రాలు, నోములు, వ్రతాలు మొక్కుపట్ల, దీపారాధనలు ఎన్నో జేయంగ జేయంగ కాన్పునిల్సింది. కానక కన్నకట్టు సీతమ్మది. అందుకే వాణ్ణి కంట్ల వత్తేసుకోని సాదింది.

ఆ నమ్మ ఆ సంతానికి మొగుళ్ల రోగం వచ్చినప్పుడు యా మందులు వారక గుడ్లు త్యాలేసిండు. అప్పుడు ఇంటి పక్కనున్న కాసింబీ వొచ్చి "ఎదురకు సీతమ్మ మామూర్షదు అనా పెద్ద ఫరిస్తా ఉన్నడు. ఆయినకు నాడి పరీక్ష గూడ తెలుస్తది. ఒక్కసారి పిల్లగాణ్ణి దోల్కరా. పైస లడ్గడు. రెండుపైసల ఊదు దీస్కోని రా. పిల్లగాణ్కి బూ మీద బువ్వ పాకి ఉంటె బిత్కుతడు." అని సెప్పింది. ఆడ్డం వొచ్చిన రాయి కంత మొక్కంగ లేంది మనిషి తోటికి గొంచపోతె వొచ్చె సెబ్బర ఏంది? అని శామకా డోలె ఉన్న పిల్లగాణ్ణి పొత్తిళ్ల పెట్టు కొని ముర్షదు కాడికి గొంచపోయింది. సీతమ్మ జేసిన పుణ్యమా అంట. ఆ నాటి మందు పైకి ఇసుకి మంత్రం శారి రోగం

గీగం బోయి పిల్లగాడు జళ జళ అయిండు. ఆ గండం గడ్సిన కాణ్ణుండి సీతమ్మ తుర్కోళ్ళ పండుగ గూడ జేస్తుండె. యాది మాసిన గని 'గ్యారిం' మాత్రం తప్పక జేసేది. దర్గ కాడికి తానె నడ్సుకుంట వోయి పూ లెక్కిచ్చి ఫాత్యా లిచ్చె దాంక ఉండి వచ్చేది. ఎవ్వరు జూడకుంట ఆ ఊదు బద్దురంగ దెచ్చి కొడుక్కు పొగ ఏసుకొనేది. ఏరు దాటంగనె తెప్ప గాలవెట్టి నట్లుగాకుండ యాట ఈ గ్యారిం పండుగ మాత్రం కట్టుగ జేస్తుండె. ఇది జూసి నల్గురు నాల్గు మాట లన్నరు. ఎంద రెన్ని మాట లన్న గూడ సీతమ్మ ఉలుక లేదు పలుక లేదు. తన పడికట్టు తప్ప లేదు. తనకు ఎదురు వడి సూటిగ పొడిసి ఆడి నట్లు అన్నోళ్ళను జూసి అమ్మా! మీరు నూరు జెప్పండి ఆరు జెప్పండి. ఎవ్వరి కడు పాత్రం వాళ్ళది. ఆపతి తిప్పలకు అడ్డొచ్చినోడే దేవుడు. యా దేవుడైతె ఏముండది. గా యింతల్నె నేను నడ్సిన తప్పు నత్త ఏముండది. ఇందుట్ల కులానికి వొచ్చిన మచ్చేముండ దని వాళ్ళ నోళ్లు మూపిచ్చి ఎప్ప టోలె తన వంతన తప్పక అన్ని సవరిస్తుంటె రాదమ్మ వొచ్చి "ఏంది సీతక్కా నీవు పురాగ అన్యాలం అయితుండవు. నేను మెచ్చిందే రంబ నేను మునిగిందే గంగ అని అనే కాడిక్కి వొస్తివి. కులం తలం మంచి చెడ్డా లేదా? ఎట్ల? నీవు నా కెంత దగ్గరైనా గని బంగారు కత్తి అని మెడ గోసుకుంటనా? అయ్యో! ఇంటింటికి వో మంటి పొయ్యి అన్నట్లు ఎతలు ఎవరికి లేవు? ముడుపులు నియమాలు ఎవ్వరికి లేవు. అందరి కున్నవి. అయినా నీ తిక్క గాకపోతె గిదంత ఏం ఏశం. ఏం కత? ఉన్న నాల్గు రాళ్లు ఊడిచ్చు కునెటందుకు ఈ యానాది తుర్క గోరే దొర్కిందా? అంటె తప్పుగని, తుర్క లల్ల గల్సి తిర్గుతమా ఎట్ల చెప్పు? అని రుస్సు బుస్సు మంటుంటె, తమలపాకు లడుక్కోని పో వొచ్చిన ఇమాంబీ లేసి 'ఏం దమ్మో రాదమ్మ! మా తుర్క దేవుణ్కి మాటలంటవ్? మాటలు జెర సక్కంగ రాని, మాకి దేవుడు తక్కువ ఉన్నడ్? నీకి దేవుడు

ఎక్కడప ఉన్నడ్. మాకీ దేవుణ్ణి ఏబువెట్టి సూపి యానాది అని కాఫిర్ పేర్ చెప్తవ్. నీకి దేవుడు గౌరమ్మ బొమ్మా ఉన్నది, ఫత్తర్ ఉన్నది" అని లొల్లి అంటె లొల్లిజేసింది. అట్ల లొల్లి పెడ్తుంటె, ఆ సుట్టు వాళ్ళు వీళ్ళు అంతా జేరి పెద్ద సంత అయింది. గోటి తోన వోయేది గొడ్డండ్ల కాడిక్కి వచ్చె" అన్నట్లు మొగోళ్లు గూడ కల్గజేసుకునే టంత రద్ది రాశెకారం అయింది ఆ నాడు. అప్పటినుంచి సిన్ననాటి దోస్తు లిద్దరు ఎడ వాసిర్రు. ఈ ఎడవాపులు ఇచ్చి పుచ్చుకున్న నిచ్చితాంబూలాలను గూడ చెదురగొట్టె కాడిక్కి వొచ్చినవి. ఇంగ నాటినుండి సీతమ్మ పేరంటెనె రాదమ్మకు సెప్పపోతైంది. యాడోన్ని పెండ్లీ ల్లనో పేరంటా ల్లనో, గుళ్లెనో, హరికథ కాడోన్ని సీతమ్మ గండ్లవడ్డ దంటె రాదమ్మ కా వాల్నని ఆమె సెప్పల ఎడే టట్లు సూటి పోటి మాట లంటుండె. కాకి మీద పిట్ట మీ దేసి తన కసి ఎళ్ళవోసుకునేది. యా ఊళ్ళ యా ముసలోడు గుటుక్కు మన్న, యా దొడ్ల్య యా పసురం నావెక్కి సచ్చినా, యా ఇంట్ల పిరంగిపిట్ట బుజ్జుమన్నా గని, అవన్ని సీతమ్మ జేస్తున్న అపచారానికిఫలితం అనేది. అవన్ని సెడిపోయిన కాలాన జర్గ రానసుంటి ఇచ్చింత్రాలు జర్గుతుండవి". ఆ ముక్కు మూతి దిప్పేది అట్ల గాయింతని ఊకుంటె బాగుండు గని ఊకోదు. ఆ(పురాగ చెడ్డంక ఏముంది సెప్పు? మన మబ్బులు ఎన్కటి తీర్గ ఉన్నరా పాడా! ఓ అంటా ముట్టా? కులమా? తలమా? యా దాంట్ల పాబంది ఏడ్సిందని? దేవుడు గూడంగ ఎంతకని ఓపిక్క వస్తడు చెప్పు? పోగాలానికే మనోళ్ళకు పెడబుద్ధులు వుడ్తుండవి. లేకుంటె ఏం రోగం జెప్పు? ఆ సీతక్కకు కడిపెడు పొల్లల్ల ఓకల్లు సుక్కేసి నట్లు అంత పేరువోయిన ఇంట్ల పుట్టి

దాని కేం కర్మ ? గోరీలల్లకు వోయి సాగిలపడి దండంపెట్టాం, అని ఊరు సుట్టు దిప్పినముచ్చెటను మళ్ళా సీతక్క కాడికే దెస్తుండేది. అసుంటి రాదమ్మ కొడ్కె యీ యాళ్ళ తుర్క దోస్తును ఎంట పెట్టు కొచ్చి ఇంట్లనే దింపిండు. ఈమాట ఇసంగనే కడ్పంత మసి ల్నట్లు అయింది. సీతమ్మ ఎటుకారంగ ఎవ్వరి యీపు వాళ్ళకు గండ్లవత్తదా? రాదమ్మ, అని తనను అడ్గినట్లు నగినట్లు రెప్ప ఏయకుండ జూసి నట్లనిపిచ్చింది. గని ఏం జేస్తది ? ఆ కొడ్కును ఏ మనాల్నో తెల్వలేదు. అనేటందుకు నోట రాలేదు. పాపం జెల్లంగొట్టిన రాయి తీర్గ నిలవడి. అయ్యో దేవుడా అంజనేయ! నా కెసొంటి సంతు నిస్తివి తండ్రీ. గంగసుంటి కులాన్ని ఈ రావణాసురుడు పుట్టి పాడుజేయ గూసుండెనే ? ఈ సంగతి ఇంగో సెవిన బడకుండ ఉంటదా ? ఇంగోళ్ళకు దెల్వకుండ ఈ సిచ్చును వొళ్లో మూట గట్టుకొని ఎట్లుండు? అని పరి పరి దెసల ఆలోచనజేసింది. ఎత పడ్డది ఏడ్సింది; మిడికింది. ఇదేం బట్టిచ్చుకోకుండ గోపాల్ రహీం కాళ్లు మొకం గడుక్కోని చాయ తాగి బంగులెక్క కూసున్నరు. మిడ్కి మిడ్కి రాధమ్మ గుండె రాయి జేసుకొని ఆఖరికి ఇద్దరికి ఒకసోటనె వొడ్డనజేసింది. అట్లైనా గుడ రహీం అంటు సొంటు ఏం గలువకుండ నె జూస్తుండది. ఎంతపని ఉన్న గని రహీం కు మంచినీళ్లు గాజుగిలాసల్నె ఇస్తుండె వాళ్ళిద్దరు దిన్నంక వొడ్డెనగిన్నె లన్ని బయట ఏయించి మళ్లా శుద్ధి జేయిస్తుండె. దినాం ఆప్రపంచకం దెప్పిచ్చి సల్లిస్తుండె. ఎందుకన్న మంచి దని వంటుకా లన్నిట్ల తప్పకుండ పాలసుక్క ఏస్తనే ఉండది.

ఇవన్ని సూ సాయగ కనిపెట్టుకుంటున్న పనిపిల్ల ఒచ్చి రాదమ్మను జూసి అమ్మా మన సిన్నదొర ఎంబడి వొచ్చినగా ఉంగురాలనెత్తి

అయ్య ఎవ్వరూ? అని అడిగింది. ఆ మాటఇని ఉల్కి-పడ్డది రాదమ్మ. గని అప్పుడే సంబాళిచ్చుకొని నీ కన్నేమొ వొచ్చినదొర దిక్కు వాయెను? నీ కెందుకే దొరల ముచ్చట్లు? ఆ దొర ఎవలైతె నీ కెందుకు? ఆదుస్తవా? తీరుస్తవా? అన్నది. ఆ మాటకు పసిపిల్ల అడిగాదమ్మ అయ్య బిడ్డను బోజినాల కాడ గూడ బాస నే మాట్లాడ్తె .మనోళ్లు గారేమొ? అని ఉడ్గిన అని పుట్కిన ఉన్నమాట కుండపలగ్గొట్టి నట్లు అడిగింది. ఆ మాటకు రాదమ్మ పిల్లా! పుల్లీ! మన లెక్క పోంటి దొర ఉన్నంద మంచె ఎట్లనే? వాళ్ళెక్కడ? వాళ్ళసదువెక్కడ? మన మెక్కడ? మనకు తెల్గు ఇడిస్తె ఇంగోటి పిడ్డ రాదు గస్క ఇందుట్ల నే పడి మునిగితేల్తం. దొరలకేందే? నాల్గుసదువు లొచ్చినోళ్ళు. బాసల మాట్లాడక ఏంజేస్తరే గంతట్లనె పకీలుసాబ్ తీర్గ కొనూసు అడ్గవట్టివి? అని పొందికంగ ఇంగోళ్లు దొర్కపట్టకుండ చెప్పింది. మీదికి, అట్లజెప్పనైతె జెప్పింది గని, తన కంత పైమీద బొంతపురుగు వాకి నట్లైంది. ఇంత గోపిరంగ దాపెట్టిన గుడ తెల్లాటోళ్ళకు ఊళ్ళైన ముష్షి. అరబ్బి ఎల్లజడిపినోడు. బారిష్టయాకు దెల్పింది. ఇంగ పట్నంకెళ్ళి రహీంమియా వచ్చిండు. పోయికలిస్తె ఖదరుఉంట దని గోపాల్ ఇంటికి వచ్చిండు. ఆ సందట్లనే తీరినట్లు జమ్మిఆకు, అక్షంతలూ సేతుల వట్టుకొని దీవిచ్చి పోద మని రామశాస్త్రుల్లు వొచ్చిండు. ఈ ఇద్దరు ఒక్కపాలే రాదమ్మ ఇంట్ల జతపడ్డరు. ఆ యాళ్ళ పండుగ గదా అని గోపాల్ తండ్రి గూడ కొత్తదోతులు గట్టుకోని భారతం జదువుకుంట గూసున్నడు. దోస్తులిద్దరు ల్యాతత మొక్కకంకులు గాలిపిచ్చుకోని వచ్చికారం ఎన్న గలిపి పుల్లి! రాసిస్తుంటె తినుకుంట అగ్బారు సదువుకుంటున్నరు. వొచ్చిన రామశాస్త్రుల్లు బంగారంబెట్టి తండ్రికొడ్కులకు దీవెన్లు వెట్టి నట్లె. తమోడే

అనుకోని రహీంమియాకు గూడ సేసలుపెట్టి దీవిచ్చింది. అట్ల అయ్య గారు ఇచ్చిన బంగారాన్ని రహీంగూడ ముద్దుగ దీసుకోని జేబు లేసు కోని గోపాలు తీర్గనె తానుగూడ అయ్యగార్కి దండం బెట్టిండు. అట్లనె మంచి చెడ్డ, ఆ ఈ మాట మాట్లాడి బాడేమియ్యగూడ రుకప్ త్ దీసుకున్నడు. ఇదంత జూస్తున్న రాదమ్మకు తామసం బట్టతరం గాలేదు. ఊకుంటె పనిగాదు. ఈ కతేందో ఆసాంతం ముదురక ముందే సక్కవెట్టు కోవాలె అని గోపాల్‌తండ్రి గూసున్నకాడ్కి వొచ్చి "ఇంటి కైన పెద్దమనిషివి అవును కాదని బుద్ధి సెప్పేది వోయి సిన్నపిల్లగాణితీర్గ వాళ్ళల్ల గల్సి తిర్గవట్టివి. బంతిబోజనం జేయవట్టివి. నాగొంతు లింగా ప్రాణముండంగ నా కండ్ల ముందల్నే గిన్ని అఘాయిత్యాలు జరుగవట్టె. దేవుడు నా సీల్గుడు సక్కగ గుదిరిచ్చిండు. పాపం సీతక్కను అనరాని మాట లంటి. ఇంత కుంపటి నాతండ్రి నా ఇంట్ల పెట్ట దని నాకు దెల్వకపాయె. గిట్లని ఎరక్క ఉంటె కులం, తలం, ఈడూ, జోడూ, మాటా మన్నిక గలిసిన, పిల్ల సీతక్కబిడ్డను నేను వొద్దనక పోదునుగదా: నట్టుల్ల నా నెత్తి ఎత్తకుండ జేస్తిరి, అయ్యాకొడ్కులుగలిసి, అని మొకాన కొంగుగప్పుకోని" ఓ అని ఏడ్సింది. అది జూసి గోపాల్‌తండ్రి ఇప్పుడు మునిగిపోయింది ఏ ముంది గన్క దూరం జేసిం దానవు సీవు, మళ్ళా నీ వే, వోయి కొడ్క కదుపు వట్టుకోని సవందం నిలుపుకో. నీ కంత ఇష్టముంటె. అని అన్నడు".

సీతక్కబిడ్డ గోపాల్ మనుసుల శనా దినాల నుండి మెదు ల్తుండది, గని సదువుల వడి వాళ్ళమ్మ సవందం జేసిందీ తెలువదు, తెంపిందీ దెలువదు. ఇప్పు డది యిని నిప్పులమీద నిల్సి నట్లు నిల్సిండు

గోపాల్. అమ్మ ఎంతపని జేసింది? అని అనుకున్నడు. గని తండ్రి జెప్పిన మాటిని సంబురంగ అమ్మా! నాయిన మాట యిను. మన కులం నిజంగ గంగ అసొంటిదె. గంగల ఎన్ని నీళ్ళు గలిస్తె మట్టు గంగకు కులం తపొవచ్చిందా? నీళ్ళు ఉప్పు గైనవా? ఇంగ గంగమ్మను మనోళ్ళంత మొక్కుతుండరా? లేదా? ఎవరి నమ్మకెలు వాళ్ళవి మనసు ఒక్కటే మంచి గుండాలమ్మ! సూడు. అట్లైతె పాపం మన రహీంకు ఏం కర్మ వొచ్చిపడింది? ముక్కు మొకం దెల్వని అయ్యగార్కి దండం బెట్టనికె? ఇదంత మన ఇంటికి వొచ్చినందుకని మన తీర్గ మెసిలిండు పాపం. అమ్మా! వాడు మణిపూసనే? నీకు దెల్వదు. నాయనా! పా సీతమ్మ అత్తఇంటికి, అని పయినమైండు.

ఇన్నాళ్ళకు తనకు గావల్సినోడు, దూరమై మళ్ళా తన ఇల్లు దేవులాడుకుంట వొచ్చిందంటె సీతమ్మకు నమ్మబుద్ది గాలేదు. ఇదంత ఇంద్రజాల మోలె అనిపిచ్చింది నాయినా గోపాల్! మీ యమ్మకు దెలిస్తె ఇంగే మన్న మిగిలిస్తదా! తండ్రి! నీవు నూరేండ్లు ఎళ్ళబతుకు. కొడుకు అని గుడ్లనిండ నీళ్ళు పెచ్చుకున్నది.ఇంతట్లనె ఎక్కనుండి గోపాల్‌తండ్రి వొచ్చి అదేంది సీతమ్మా! ఇల్లుసొచ్చుకొని వొచ్చినోళ్ళను పరాయోళ్ళను జూసినట్టుజూడవద్దివి. అని యా ఆరమరికెలు లేకుండ ఇంట్లకు జొరపడ్డడు.

ఇల్లుజొచ్చుకోనివచ్చిన రాఘవయ్య సీతమ్మను జూసి అన్నిమర్శిపోవమ్మ! "అమ్మా సీత! నీవు నమ్మతవో! నమ్మవోగని అది మీదికి గయ్యాళి గంగమ్మోలె మాటలంటదిగని, విన్నదఖుసుకొని దాని మనసు కుమ్మరావం

గాలినట్లు గాలింది అనుకో. ఇంత కాలానికి మావోడు పెద్దగైదానికండ్లుదెరి పిచ్చిండు తల్లి. అందుకోసమే నేను ఇన్నాళ్ళు 'హరా' అనకుంట 'శివా' అనకుండ తమాసజూసుకుంట ఊకున్న. అప్పట్ల మేం మొగోళ్ళం అడ్డ మొచ్చినా, ఏమన్నా అన్నా, ఆ మాట చెల్లెటట్లులేకుండె. మా ఇజ్జతు దక్కె టట్లు లేకుండె. ఇదంత ఎందుకమ్మో! నీవే గెల్సినవ్ గదా! ఆ యింటి మీది కాకి యీ ఇంటిమీదికి వాలకుండ యాణ్ణన్న గలిస్తె పొయ్యిల నిప్పు వోసి సట్లున్న నీ యింటికి రాదమ్మ ప్రాణాలసొంటి నేనూ, నా పని గంత కొడ్కు నడ్సుకుంట వొస్తిమిగద తల్లి!" అని అంటుంటె ఎన్కటివి ఒక్కసారి యాది కొచ్చి ఎక్కిళ్ళుపడే టట్లు ఏడ్సుకుంట కండ్లుదుడ్సుకొని సీతక్క అమాతంవొచ్చి గోపాల్‌ను రెండుచేతుల అబ్బుకొని! ముద్దాడి గోపాల్, రా నాయినా! వొచ్చికూసోండి. పాపిష్టిదాన్ని దేవుణి అసొంటి అన్నయ్య మణుసు నొప్పిచ్చిన. ఎన్నాళ్లుంటరయ్య, ఈ ఊళ్ళ! ఈ పిల్లగాడెనా? నీ యెంట వొచ్చిన దోస్తు? అని ప్రాణవాత్తికంగా మాట్లాడుతుంటె గోపాలు కండ్లన్నీ ఇంటి నాల్గుదిక్కులు దేవులాడుతుండవి. ఇంతట్లనే చేతుల ఫలారప్పు కిస్తి, వట్టుకోని ఇగ్గపూసిన మాధవి తీగోలె గోపి వచ్చింది. గోపీని జూసి మొగ్గదొడ్గిన కడిమిచెట్టుతీర్గ అయిండు గోపాలు. ముచ్చెమట లువోస్తున్న గోపాలు జేబులకెల్లి దస్తిదీసుకోని పణిమీదచెముట దుడ్సు కున్నడు. గోపిచెయ్యిపణికి శర్బత్‌కొంచెం గోపాల్ మీద వొలికింది.

"రహీం కెం భాయి క్యాబాత్ హై" అన్నడు. గోపి కండ్లుదించు కున్నది ఇంతట్లకె తెగినదారం ముడిపడ్డది.